# ★ ఘోరమైన నేరం ★

* శ్రీ పేరుమళ్ళ కామేశ్వరరావు *

ఆ గేటుచూడ ముచ్చటగా ఉంది. ఎత్తైనగచ్చు గోడల మీద గచ్చుకొంజా ఇనప కటకటాల చక్రాల తలుపులు వాటికి నీలిరంగు పూత కావలి నిల్చోడానికి దానిని ఆనుకొనే గచ్చుగూడు. అంతా షోకుగా ఉంది.

వేమయ్య నెత్తిమీద పాగా, డవాలా వేసుకుని నిల్చుంటాడు తలుపులు తియ్యడం, మయ్యడం అతని పని సామాన్యులెవ్వరూ ఆతని అనుజ్ఞ లేనిదే లోపలికి అడుగు పెట్టలేరు

గేటుని అంటిపెట్టుకొనే పూలతోట, పందిళ్లు ఉన్నాయి దారిని పోయే పిల్లకాయలు కటకటాలు పట్టుకొని, మొహాలను ఆన్చి పూలవైపు ముచ్చటగా చూస్తారు పువ్వులిమ్మని అడిగితే వేమయ్య బెదరిస్తాడు మొండికెత్తిన వాళ్ళ చేతులలో రాలి కిందపడ్డ పువ్వులు ఏవో రెండు పడేసి "తిరిగి చూడకుండా పరుగెత్తండి"! అంటాడు

ఆభవనం నీలాచలరావుది అతను పిల్లజమీందారు అన్ని అలంకారాలతోను, నౌకర్లతోను ఆభవనం కలకలలాడుతూంటుంది తోటలో మొక్కలమీద చెయ్యి వేస్తే అతను ఊరుకోడు తోట అందమంతా చెడి పోతుందంటాడు దొంగతనమంటే మండిపడిపోతాడు 'గోడదాటి వచ్చిన అల్లరి పిల్లకాయలను తుక్కురేగగొట్టి బుద్ధి తెప్పిస్తాడు అతనిలో మంచికి మంచీ ఉంద చెడ్డకి చెడ్డాఉంది అతని దర్శనం లభించిన బీదసాదలు వ్యర్థంగా వెళ్ళడం ఎవ్వరూ చూడలేదు

పని మనుష్యులు సరిగా వేళకివచ్చి పనులు చేసుకుపోవాలంటాడు నీలాచలరావు ఏకారణంచేతేనా పనికి రాకపోతే ముందే చెప్పుకొని అనుజ్ఞ తీసుకు పోవాలి అంతే కాని రేపువచ్చి దొరగారి దగ్గిర మనవి చేసుకుందాంలే అంటే, అసలు మనవి చేసుకోనే అక్కరలేదు

గేటుకాపలా అన్నివేళలా అవసరమే అర్ధరాత్రి, అపరాత్రి పనిపడుతూనే ఉంటుంది వేమయ్య ఇల్లు ఏగూడెంలోనో ఉంటే గేటుపని ఏమైనట్టు! అయినా కావలికి డబ్బు దండగ పెట్టి ఇల్లెవరు కట్టిస్తారు? పోనీ ఆవరణలోనే ఒక పూరిగుడిసె వేసుకోవచ్చేమో అంటే, భవనం, తోట అందమంతా చెడిపోతుందని లబలబ కొట్టుకుంటాడు పిల్లజమీందారు అందుచేత వేమయ్య ఇంటి వెనకత్తట్టు ప్రహరీ గోడనానుకొని ఒక తాటాకుల కప్పువేసుకొన్నాడు. ఎప్పుడు పిలిస్తే అప్పుడు హాజరు

అతనికి గేటు కాపలా అని పేరేగాని అప్పటికి ఏపని అవసరమైతే ఆపనిమీద బయలుదేరాలి మొత్తంమీద ఒక్కక్షణం తీరిక ఉండదు వచ్చేరాబడి తక్కువ సంసారమా పెద్దది అయినా ఏలాగో సంసారాన్ని ఈడ్చుకు వస్తున్నాడు

ఆరోజు వేమయ్య పెళ్లానికి సుస్తీ, పెద్దకూతురికి సుస్తీ ఇంటిలో కాచిపోసే దిక్కు లేదు పగలంతా పని చేసి రాత్రి పదింటికి కొంప చేరుకొన్నాడు మంచినీళ్లు కడుపునిండ తాగి కడుపులో కాళ్లుపెట్టుకు పడుకున్నాడు. అర్ధరాత్రి పూట గజాననరావు బండిమీద రాగా వేమయ్యకి పిలుపు వచ్చింది బోరు తలుపులుతీసి మళ్లీవేసి, వెళ్లి పడుకొన్నాడు తెల్లవారింది. ఎప్పటి పాటే!

గజాననరావు నీలాచలరావుకి దగ్గిరచుట్టం మనిషి దుండుముక్కలాగుంటాడు. వెడల్పయిన మొహం, తుట్టి పెదవులు. శరీరచ్ఛాయ ఎండాకాలంలో భూదేవి వర్ణం మనిషి నడుస్తూనే ఈత కొడుతూన్నట్లుగా చేతులు వేస్తాడు మల్లెపువ్వులాంటి మెట్టూరి మల్లు దుస్తులు ధరించేడు అతను పొద్దున్నే కాఫీ పుచ్చుకొని వన విహారం చేస్తున్నాడు

నీలాచలరావు ఏదో పనిమీద వీధిలోకి వెళ్ళేడు. తిరిగి ఎప్పుడు వస్తాడో తెలియదు

వేమయ్య నిల్చున్నాడన్న మాటేగాని మనస్సు అయోమయ మైపోతూంది కడుపులో దహించుకు పోతూంది ఉపవాసాలకి ఎంత అలవాటుపడ్డవాడైనా ఆరోజు తట్టుకోలేకపోతున్నాడు గేటు దగ్గిర నిల్చున్నవాడు రెండడుగులు వేసి అక్కడే దొండ తీగెను రెండు కాయలు పుటికి జేబులో వేసుకున్నాడు పటు మని కొరికి నమిలి, మళ్ళీ ఏమీ ఎరగనట్టు మొహంపెట్టి చూస్తున్నాడు

# ఘోరమైన నేరం

ముందడుగు వేసి గజాననరావు ''ఏమిటిరా దొంగా ఆ పని !'' అన్నాడు.

అజాగ్రత్తగా ఉన్న వేమయ్య ఉలికి పడ్డాడు.

గేటుదగ్గిర నీలాచలరావు దర్శనమయింది. కంగారుగా పరుగెత్తుకువెళ్ళి తలుపు తీశాడు వేమయ్య

గజాననరావు ఇచ్చకం కోసం నీలాచలరావుతో 'మన గేటు కాపలా బాగా కాస్తున్నాడే !' అన్నాడు

"ఏమి?" అన్నట్లుగా చూశాడు నీలాచలరావు.

"ఏమిటో వాడినే అడగండి !"

"ఏమిరా, ఏమిటి సంగతులు?" అని నీలాచలరావు ప్రశ్నించేడు

వేమయ్య నోటమాట లేదు

"అదేమిటిరా ! అడిగినదానికి సమాధానం చెప్పక స్తంభంలాగు నిల్చుంటావు ?" అన్నాడు నీలాచలరావు.

వేమయ్య తెప్పరిల్లి ''మరేం లేదండి బాబయ్యగారూ!'' అని మళ్ళీ ''మరేం లేదండి !'' అన్నాడు.

''నిజం చెప్పరా !'' అన్నాడు గజాననరావు.

వేమయ్య బిక్క మొహం వేసాడు.

"ఇంతెందుకు జేబులో ఉన్నవి ఇవతల పెట్టుదూ!" అని సూచించేడు గజాననరావు.

''తియ్యవేమిరా !'' అన్నాడు నీలాచలరావు.

వేమయ్య తడుముతూన్న వేళ్ళతో జేబులోంచి సగం కొరికిన దొండకాయను ఇవతలకి తీశాడు.

"ఆరి దొంగా ! యెంతకాలంనుంచి ఈ పని చేస్తున్నావురా ! కంచే చేనుమేసిందిట. పాతదొంగ పట్టుబడక మానడ''ని సామెత అన్నాడు నీలాచలరావు.

''ఇక్కడే కాదండి, ఎక్కడైనా ఇంతేనండి అన్నగారూ !'' అన్నాడు గజాననరావు

నీలాచలరావు విస విస నడిచిపోయేడు భుజాలు ఎగరవేసుకుంటూ వెనకాల వెళ్ళాడు గజాననరావు.

వేమయ్యని పిల్చుకురమ్మని నౌకర్లను పంపించేడు పిల్లజమీందారు.

కడుపునిండిన నీలాచలరావు స్మృతిలో దొంగతనంకంటె ఘోరమైన నేరంలేదు.

ఇంతకాలం తాను నమ్మకంగా చేశాననీ, ఏదో రవ్వంత కక్కూర్తి పడ్డాననీ వేమయ్య మొరపెట్టుకొని, అంతటిలో స్ఫురించి "బాబయ్యగారూ ! అది రోగానికి వైద్యమని సెప్పేడండి వైద్యుడు దొరగారూ !'' అని బొంకేడు.

నీలగిరిరావు వాటన్నిటిని పెడచెవిని పెట్టేడు.

సేవకులు వేమయ్యను చిత్తుగా తన్నివేశారు. నాటి నుండే ఉద్యోగం నుంచి బర్తరఫ్!

★

---

## ఆంధ్ర మహిళా సభ

### (పారిశ్రామిక శాఖ)

14, ద్వారక, మైలాపూరు, మదరాసు.

డిసెంబరు 15 వ తేదీ నుండి ఇక్కడకూడా ప్రతిదినమూ మధ్యాహ్నము 3 గం॥ నుండి 5 గం॥ వరకు కుట్టు క్లాసులు జరుగుచున్నవి మిషను కుట్లు, ఎంబ్రాయిడరీ కుట్లు నేర్పబడుచున్నవి

ప్రవేశ రుసుము రూ. 2—0—0 మాస రుసుము రూ. 1—8—0

జేరగోరువారు ఏరోజైనా 10 గం॥ నుండి 5 గం॥ వరకూ ద్వారక ఆఫీసులో తెలిసికొనవచ్చును

అ. చన్నఘంటమ్మ,
సంయుక్త కార్యదర్శిని.